క్లుప్తంగా

నిబంధనలు సడలించాలి

గుమ్మలక్ష్మీపురం: రేషన్‌కార్డులకు సంబంధించి, ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలు సడలించాలని కురుపాం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన స్థానిక విలేకరులతో సోమవారం మాట్లాడారు. రైస్‌కార్డు కావాలంటే పెళ్లికార్డు, వివాహ ధ్రువీకరణ పత్రం వంటివి కావాలని సచివాలయ సిబ్బంది చెబుతోందని, దీంతో ఏం చేయాలో తెలియక చాలామంది ఆందోళన చెందుతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లోని పేద గిరిజనుల పెళ్లిళ్లకు వివాహ ధ్రువీకరణ పత్రాలు ఉండవన్నారు. రేషన్‌కార్డులో కొత్త సభ్యుడి చేరిక, కొత్త రేషన్‌కార్డు చేసుకోవాలన్నా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కారానికి చర్యలు

వీరఘట్టం: మండలంలోని నడుకూరులో తలెత్తిన లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి శాశ్వత చర్యలు చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.విష్ణుమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులుగా గ్రామంలో జరుగుతున్న పండగ సందర్భంగా విద్యుత్ వినియోగం ఒక్కసారిగా పెరగడంతో ఆదివారం విద్యుత్ సమస్య ఏర్పడిందన్నారు. అయితే ప్రస్తుతం తాత్కాలికంగా విద్యుత్ సమస్య పరిష్కరించామని, ఇక మీదట లో ఓల్టేజీ సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేసేందుకు అదనపు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

వాహన తనిఖీలు..



పాలకొండ - వీరఘట్టం రహదారిలో ఎస్సై ప్రయోగమూర్తి నేతృత్వంలో సిబ్బంది సోమవారం వాహన తనిఖీలతో పాటు డ్రంకన్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం మత్తులో డ్రైవింగ్ చేస్తున్న వారిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

– పాలకొండ రూరల్

బొమ్మలతో భావం చెప్పొచ్చు..



విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: మనిషి తన భావాలను బొమ్మల ద్వారా వ్యక్తీకరించవచ్చని పాలకొండ శాఖా గ్రంథాలయ ఇన్‌చార్జ్ బబ్బూరి గణేష్ బాబు అన్నారు. గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా చిన్నారులకు కర్టూన్లు వేసే విధానంపై తంపటాపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి సోమవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడు కె. జనార్దన రావు, తదితరులు పాల్గొన్నారు.

బకాయి పన్నులు వసూలు వేగవంతం



మాట్లాడుతున్న డీపీఓ కొండలరావు

సీతంపేట: ఇంటి పన్ను బకాయిల వసూలు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి కె. కొండలరావు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయంలో గ్రామ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ పంచాయతీ, యోగాంధ్ర, ఆధార్ సీడింగ్, చెత్త నుంచి సంపద తయారీపై చర్చించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ రాంప్రసాద్, బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి



ఓపీ వద్ద క్యూలో ఉన్న రోగులు

సీతంపేట: అడపాదడపా కురుస్తున్న వర్షాలకు స్థానిక ఏరియా ఆస్పత్రికి రోగుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. జ్వరం, తదితర లక్షణాలతో బాధపడుతున్న సుమారు 300 మంది సోమవారం ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందారు. రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. అన్ని రకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

కారు మబ్బులు.. కమ్ముకున్న వేళ..



రుతు పవనాల రాకతో కురుస్తున్న వర్షాలు ప్రజలకు ఊరటనిస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్ర సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మర్పులు చోటుచేసుకున్నాయి. ఉరుములు, మెరుపులతో కూడిన గాలులు వీయడంతో ఒక్కసారిగా నల్లని కారుమబ్బులు పట్టణాన్ని కమ్మేశాయి. చల్లని గాలులు.. మరో వైపు మబ్బులు కమ్మేయడంతో భారీ వర్షం తప్పదని అంతా భావించారు. అయితే అనుకున్న వర్షం కురవకపోయినా ఆహ్లాదకర దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

– పాలకొండ రూరల్

అప్రమత్తతే ముఖ్యం...



నీటిలో చిన్నారుల సందడి (ఫైల్)

- పెరుగుతున్న నీటి ప్రమాదాలు
- చెరువులు, కాలువల్లో దిగి మృత్యువాత పడుతున్న పిల్లలు
- తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి..

భామిని: ఇటీవల కాలంలో అత్యధికంగా నీటి ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా విద్యార్థులు చెరువులు, వాగులు, కాలువల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. తాజాగా గోదావరి నదిలో ఈతకు వెళ్లి పదిమంది మృత్యువాత పడ్డారు. ఇటీవల ఏలూరు జిల్లాలో ముగ్గురు పిల్లలు నీటి మునిగి పోయారు. కొద్ది రోజుల కిందట భామిని మండలం బంద్రసింగికి చెందిన ఇద్దరు ఆదివాసీ గిరిజన విద్యార్థినులు నీటి గుంటలో మునిగి ప్రాణాలు పోగొట్టుకొన్నారు. గతంలో గురండి సీతామహాలక్ష్మి చెరువులో నలుగురు బాలికలు నీట



బంద్రసింగిలో నీటి గుంటలో మునిగిన బాలికల మృతదేహాల వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు (ఫైల్)

మునిగి ఒకేసారి మరణించారు. వంశధార నదిలో పలు నీటి ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి.

వేసవి సెలవులు కావడంతో విద్యార్థులు, చిన్నారులు సరదాలకు పోయి ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఈతకు వెళ్తామని చెప్పి చెరువులకు వెళ్తున్న చిన్నారులు ఎటువంటి జాగ్రత్తలు

పిల్లలపై దృష్టి పెట్టాలి...



పాఠశాలలకు సెలవులు రావడంతో పిల్లలకు స్వేచ్ఛ పెరుగుతుంది. తోటి స్నేహితులతో ఆటలకు పోయి ఈత రాకపోయినా నీటిలో దిగడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. తల్లిదండ్రులు పిల్లల చర్యలపై దృష్టి సారించాలి. ముందస్తుగా అప్రమత్తం చేయడం కూడా మంచిదే. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి.

..డాక్టర్ కె.సంతోషిలక్ష్మి, వైద్యాధికారి, భామిని

పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమయంలో చిన్నారులతో పాటు తల్లిదండ్రులు కూడా జాగ్రత్తలు పాటించాలని నిపుణులు చెబుతున్నారు.

ఈతకు వెళుతున్నారా.. జాగ్రత్తలు తీసుకోండి..

- చెరువులు, కుంటలు, బావులు, కాలువల్లో ఈతకు దిగే ముందు లోతు అంచనా వేయాలి. నీటి ప్రవాహ వేగాన్ని గమనించాలి.
- పిల్లలు ఈతకు వెళ్తున్నప్పుడు వెంట తల్లిదండ్రులు వెళ్లాలి.
- పూర్తిగా ఈత వచ్చిన తర్వాతే కొంచెం లోతు ప్రదేశాలకు వెళ్లాలి. సెలవుల్లో పిల్లలు ఏం చేస్తున్నారన్నదీ పెద్దలు ఓ కంట కనిపెడుతూ ఉండాలి.
- విహార యాత్రలు, తెలియని ప్రదేశాలకు వెళ్లినప్పుడు అక్కడ సూచించిన ప్రదేశాల్లోనే స్నానాలు చేయాలి.
- మద్యం మత్తులో నీటిలోకి దిగకూడదు. జలాశయాల్లో ఈతకు వెళ్లక పోవడం ఉత్తమం.
- స్నేహితుల బలవంతంతో ఈత రాకపోయినా నీటిలోకి దిగొద్దు. ప్రమాదాలను తెలిపే హెచ్చరిక బోర్డులు గమనించాలి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సీతంపేట:

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ఎంఎంఎస్ కార్యాలయంలో యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి రోజూ యోగా చేయాలన్నారు. దీని ద్వారా ఒత్తిడిని అధిగమించవచ్చని చెప్పారు.



యోగా చేస్తున్న దృశ్యం

కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ఎంపీడీఓ బీబీ మిశ్రో, యోగా గురువు వెంకటేశ్వరరావు, ఏపీఎం కమల పాల్గొన్నారు.

ముమ్మరంగా ఐఈఆర్‌టీ సర్వే

భామిని: మండలంలో భవిత ఐఈఆర్‌టీ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. సన్నాయికాలనీలో గిరిజన కుటుంబాల్లో ఉన్న ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల వివరాలు సోమవారం నమోదు చేశారు. గతంలో భవిత కేంద్రంలో ఉన్నవారితో పాటు కొత్త వారి వివరాలు కూడా నమోదు చేస్తున్నట్లు ఐఈఆర్‌టీ వలంటీర్లు సురేష్‌నాయుడు, వెంకటరావు తెలిపారు. కార్యక్రమాన్ని ఎంఈఓలు ఎ.శ్రీనివాస్, వి.భాస్కరరావు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.



సన్నాయికాలనీలో సర్వే చేపడుతున్న ఐఈఆర్‌టీ వలంటీర్లు, గిరిజనులు

సాగునీరు అందేలా చర్యలు తీసుకోండి

పాలకొండ: తోటపల్లి ఎడమ కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని వెంకమ్మపేట సచివాలయ సిబ్బందికి సోమవారం వినతిపత్రం అందజేశారు. కాలువల ద్వారా ప్రతి ఏటా శివారు ప్రాంతంలో ఉన్న పాలకొండ ఆయకట్టుకు సాగునీరు అందడం లేదని వైఎస్సార్‌సీపీ నాయకుడుకోరాడ సూర్యనారాయణ బాబు తెలిపారు. పాలకొండ, ఎన్‌కే రాజపురం, సింగన్నవలస, కొండాపురం, వెలగవాడ ప్రాంతాలకు సాగునీటి సమస్య ఉందని.. ఆయా ప్రాంతాలకు కాలువల ద్వారా నీరు విడుదల చేయాలని రైతులు



సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న రైతులు

కారెపు చిట్టిబాబు, బోనుమంతుల సోమశేఖర్, తదితరులు కోరారు.

పరిసరాల పరిశుభ్రత

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో పరిసరాల పరిశుభ్రత సోమవారం చేపట్టారు. సర్పంచ్ ఎం.నారాయణమ్మ, ఉప సర్పంచ్ టి.ఎల్లంనాయుడుల ఆధ్వర్యంలో గొంగాడ, ప్రధాన, తెర్లి, సెగిడి, సాలి వీధులతో పాటు బీసీ కాలనీలో పేరుకుపోయిన చెత్తాచెదారం ఏరివేశారు. అలాగే కాలువల్లో పూడికలు తొలగించి, బ్లీచింగ్ చల్లారు. పాడైన విద్యుత్‌దీపాల స్థానంలో కొత్త బల్బుల ఏర్పాటు, మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ కార్యక్రమాలు చేపడుతున్నామని సర్పంచ్ తెలిపారు.



బీసీ కాలనీలో చెత్తాచెదారం ఊడ్చుతున్న సిబ్బంది

నూతన వార్డులో అదనపు బెడ్లు




నూతన వార్డులోని బెడ్లపై రోగులు

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య రోజు రోజుకూ అధికమవుతుండడంతో పడకలు సరిపోవడం లేదు. నూతనంగా నిర్మించిన పై అంతస్తులోని ఒక వార్డులో 22 బెడ్లు అదనంగా వేయించి చిన్నారులకు వైద్యసేవలు అందిస్తున్నట్లు సూపరింటెండెంట్ బి. శ్రీనివాసరావు తెలిపారు. గదులు పూర్తిస్థాయిలో పూర్తయితే ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లకు వినియోగిస్తామన్నారు.

సత్వర పరిష్కారం చూపాలి

పార్వతీపురం టౌన్: పీజీఆర్ఎస్ విభాగానికి ప్రజల నుంచి వచ్చిన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పార్వతీపురం సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కె ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ పి ధర్మ చంద్రా రెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

మద్యం, సారా ధ్వంసం



సీతానగరం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆదేశాలమేరకు సోమవారం సీతానగరం సర్కిల్ పరిధిలో వివిధ సోదాల్లో పట్టుబడిన మద్యం సీసాలు, సారాను ధ్వంసం చేశామని సీఐ డి.పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీతానగరం సర్కిల్ పరిధిలో 72 కేసులలో పట్టుబడిన 106.75 లీటర్ల మద్యం, 2 కేసుల్లో పట్టుబడిన 39.5 లీటర్ల సారాను ధ్వంసం చేశామని తెలియజేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ రెండో వారంలో పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలు

వీరఘట్టం:

వేసవి సెలవుల అనంతరం జూన్ 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నందున జూన్ రెండో వారంలో ఉపాధ్యాయులు పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావు అన్నారు. సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో వీరు విలేకరులతో మాట్లాడుతూ.. పాఠశాలలు తెరిచిన రోజే డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను విద్యార్థులకు అందజేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న ఐదేళ్లు నిండిన పిల్లల వివరాలను



మాట్లాడుతున్న ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావు

సేకరించి వారిని సమీప ప్రాథమిక పాఠశాలల్లో చేరేందుకు ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు.

హెల్ప్‌డెస్క్‌ను సద్వినియోగం చేసుకోండి

వీరఘట్టం: ఉపాధ్యాయ బదిలీ దరఖాస్తులు అప్‌లోడ్ చేయడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేసేందుకు స్థానిక ఎంఈఓ కార్యాలయంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను సద్వినియోగం చేసుకోవాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు కోరారు. హెల్ప్ డెస్క్ వద్దకు సోమవారం వచ్చిన పలువురి దరఖాస్తులను అప్‌లోడ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శీలా గణేష్, కరణం ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



దరఖాస్తులను అప్‌లోడ్ చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ఎండీయూ వాహనాలు కొనసాగించాలని ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ.. వాహనాల ద్వారానే ఇంటింటికీ రేషన్ పంపిణీ చేయాలన్నారు. గిరి శిఖర గ్రామాల వారు రేషన్ సరుకుల కోసం కొండలు దిగి కిందకు రావాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్.రాము, చెంచయ్య, రమేష్, బి.అప్పారావు, వెంకీ, సర్పంచ్‌లు కె.వెంకునాయుడు, తిరుపతిరావు, ఎం



ఎండీయూ వాహనాలు కొనసాగించాలంటున్న ఎంపీపీ, తదితరులు

పీటీసీ సభ్యులు ఎస్.మంగయ్య, హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, కేజీబీవీ, ఏకలవ్య పాఠశాలల వసతిగృహాలతో పాటు భద్రగిరి పోస్ట్‌మెట్రిక్ బాలురు, బాలికల హాస్టళ్లను కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జె.సౌమ్య జాస్పిన్ సోమవారం సందర్శించారు. ఆకస్మికంగా ఆయా ప్రాంతాలకు వెళ్లి, హాస్టళ్లలో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను క్షుణ్నంగా తనిఖీ చేశారు. గృహాల ఆవరణలు పరిశుభ్రంగా ఉంచాలని, ముఖ్యంగా మెస్(వంటగది)లు శుభ్రంగా ఉంచాలని వార్డెన్‌లకు సూచించారు. అలాగే విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు అందివ్వాలని ఆమె తెలిపారు. ఆమె వెంట గుమ్మలక్ష్మీపురం ఎంఈవో బి.చంద్రశేఖర్,



ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల వసతిగృహాన్ని తనిఖీ చేస్తున్న న్యాయమూర్తి సౌమ్యజాస్పిన్

ఎల్విన్‌పేట ఎస్ బి.శివప్రసాద్, కోర్టు పీసీ ఎ.పోలిరాజు తదితరులు ఉన్నారు.

బదిలీల్లో సీనియార్టీకి ప్రాధాన్యం..

వీరఘట్టం: మరికొద్ది రోజుల్లో జరగనున్న ఉపాధ్యాయుల బదిలీల్లో సీనియార్టీకి తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంఆర్‌సీలో ఎంఈఓలు డి.గౌరినాయుడు, ఆర్.ఆనందరావులను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. 7 సంవత్సరాల 9 నెలల సర్వీసు పూర్తి చేసుకున్నవారికి ఎనిమిదేళ్ల అకడమిక్ ఇయర్‌గా గుర్తించి 23.4 పాయింట్లు కేటాయించారని.. అయితే ఎనిమిదేళ్ల అకడమిక్ ఇయర్ కింద ఇంకొందరు 7 సంవత్సరాల 5 నెలలు సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి 24 పాయింట్లు కేటాయించారని తెలిపారు. ఎక్కువ సర్వీస్ ఉన్నవారికి తక్కువ పాయింట్లు, తక్కువ సర్వీస్ ఉన్నవారికి ఎక్కువ పాయింట్లు కేటాయించడం సరికాదన్నారు. సీనియార్టీ ఎక్కువ ఉన్న వారికి అధిక పాయింట్లు



ఎంఈఓలు గౌరినాయుడు, ఆనందరావులకు వినతిపత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

కేటాయించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఏపీటీఎఫ్ నాయకులు మండల మురళీ, ఆర్.ధనుంజయనాయుడు, డి.శ్రీనివాసరావు, బీఎం గౌరీశ్వరరావు, సీహెచ్ తిరుపతిరావు, బి.రామారావు, తదితరులు ఉన్నారు.

వాహనాల ద్వారానే రేషన్ పంపిణీ చేయాలి

జియ్యమ్మవలస రూరల్: వాహనాల ద్వారానే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కూరంగి సీతారాం డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలో తహసీల్దారు ఎం.చెన్నారావును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. జూన్ నెల నుంచి రేషన్ షాపుల వద్దనే రేషన్ తీసుకోవాలని, ఇకనుంచి ఎండీయూ వాహనాలు ఉండవని వాటి ద్వారా రేషన్ పంపిణీ జరగదని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలియజేశారని గుర్తు చేశారు. అలా అయితే గిరి శిఖర గ్రామాల్లోని ప్రజలు రేషన్ తీసుకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. పట్టణ ప్రాంతాలు, మైదాన ప్రాంతాల్లో ఆ అవకాశం లేకపోయినా కనీసం గిరిజన



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకుడు సీతారాం

ప్రాంతాల్లోనైనా ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కుట్టుమిషన్ శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన మహిళలు

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళలకు నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణను ఎంపీడీవో కె.ధర్మారావు సోమవారం ప్రారంభించారు. మొత్తం 121 మందికి శిక్షణ ఇవ్వనున్నామని, మహిళల జీవనోపాధి పెంచడమే లక్ష్యంగా ఇస్తున్న ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కోరారు. శిక్షణార్థులు శిక్షణ పూర్తయ్యేంత వరకు 75 శాతం హాజరు ఉండేలా చూసుకోలన్నారు. 90 రోజుల ఈ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు, కుట్టుమిషన్లు అందివ్వనున్నామన్నారు. కార్యక్రమంలో ట్రైనర్‌లు ఆర్.సంధ్య, ఎస్.శంకరరావు పాల్గొన్నారు.

గౌరవంగా మెలగాలి..

పాలకొండ రూరల్: ఆర్టీసీ సిబ్బంది ప్రయాణికులతో గౌరవంగా మెలగడంతో పాటు సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, తాగునీటి నిర్వహణపై ఆరా తీశారు. వర్షాకాలం సమీపిస్తున్న క్రమంలో పారిశుధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మరికొద్ది రోజుల్లో కళాశాలలు, పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో రాయితీ బస్సు పాస్‌లను ఉన్నతాధికారుల సూచనల మేరకు అందిస్తామన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.